క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : మండలంలోని కాలువపల్లి పంచాయతీ బాలోల్లపల్లిలో రామాలయం నిర్మించేందుకు గురువారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, జగనన్న పాలనా విధానంపై ఆరా తీయగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున, నన్నేసాహెబ్, మహబూబ్‌బాషా, రమణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనుల వద్ద సర్పంచ్ సుబ్బిరెడ్డి, గ్రామస్తులు

పెద్దతిప్పసముద్రం : తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నెల రోజుల క్రితం మండలంలోని మల్లెల పంచాయతీలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆవులరెడ్డిపల్లిలో సిమెంటు రోడ్డు వేయించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే రూ.3 లక్షల నిధులను సీసీ రోడ్డుకు మంజూరు చేశారు. సదరు పనులను గురువారం గ్రామస్తులతో కలసి బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లెల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



గుర్రంకొండలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుర్రంకొండ : మండల పరిధిలోని ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థిని, విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఇలా ఈశ్వరయ్య, పీడీ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దురలవాట్లు, దుష్పరిణామాలు– నివారణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించారు. మొత్తం 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మరికొంత మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న యువజన విభాగం నాయకులు

కేవీపల్లి : వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తప్పెట సాహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ గుండ్రేవారి పల్లె క్రాస్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీలో యువకులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. పార్టీకోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నాకర్ రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు రెడ్డెప్పరెడ్డి, వినీష్‌రెడ్డి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మెల్మరువత్తూరుకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : తమిళనాడు రాష్ట్రంలోని మెల్మరువత్తూరు ఓం శక్తి ఆలయ దర్శనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఓం శక్తి మాలాధారుల కోసం సాధారణ చార్జీలతో బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మెల్మరువత్తూరుతోపాటు కంచి, చెంగల్‌పట్టు, అష్టలక్ష్మి అమ్మవార్ల దర్శనం కూడా ఉంటుందన్నారు. ఓం శక్తిమాలాధారులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని వలసపల్లె పంచాయతీ గ్రామసచివాలయం, పట్టణంలోని 23వ వార్డు సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల డిజిటల్‌బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వంలో పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజలకు మంచి జరిగే పనులు చేయలేదని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ, జనసేన ఏకమయ్యాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రి, 40 ఏళ్ల అనుభవం అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు, జగనన్నలా పేదలను ఆదుకునేందుకు పథకాలు ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు రాలేదన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అనుగ్రహం, ఇంటిపై టీడీపీ జెండా ఉంటేనే పథకాలు ఇచ్చేవారని, నేడు ఓటువేసినా, వేయకున్నా అర్హత ఉంటే ప్రతి ఒక్కరికీ పథకాలు ఇచ్చేపరిస్థితి జగనన్న ప్రభుత్వంలో ఉందన్నారు. ప్రజలు ఇవన్నీ ఆలోచించుకుని మంచి చేస్తున్న జగనన్నకు మద్దతుగా నిలవాలన్నారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి, పారదర్శక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వెలుగుచంద్ర, ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ గంగుల్‌రెడ్డి, కె.మహేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, శారదారెడ్డి, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, రామిశెట్టి శివయ్య, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, షరీఫ్, గుండ్లూరు రఫీ, నీరుగట్టి రమణ, రెడ్డెప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం

బి.కొత్తకోట : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం బి.కొత్తకోట ఐదో సచివాలయ పరిధిలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమాదేవి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అయూబ్, పట్టణ జేఏసీ కన్వీనర్ మోహన్ బాబు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ చిన్నికృష్ణ, సచివాలయ కన్వీనర్లు శెట్టిపల్లె రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వలసపల్లెలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

అభివృద్ధే ధ్యేయంగా పాలన

మదనపల్లె : పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఒక్కో కుటుంబానికి పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎటువంటి అవినీతి లేకుండా పాలన సాగిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వెలుగు చంద్ర, నాయకులు సిద్దల వేమారెడ్డి, నీరుగట్టి రమణ, ఇస్మాయిల్, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి

మదనపల్లె : ప్రతి మండలంలో తహసీల్దార్లు తప్పనిసరిగా ప్రతి నెలా మూడో సోమవారం మండల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అధ్యక్షతన మదనపల్లె రెవెన్యూ డివిజన్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. డీఎస్పీ కేశప్ప, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, డీఎల్‌డీఓ లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గతంలో జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా భారతీయ అంబేడ్కర్ సేన వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయకపోవడమేమిటని నిలదీశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విగ్రహం కనిపించకుండా భారీ కటౌట్లు అడ్డుగా పెట్టినా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నరేంద్రబాబు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో కొందరు పోలీసులు కౌంటర్ కేసులు పెట్టిస్తున్నారని, చట్టాన్ని నిర్వీర్య పరిచేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రెండు గంటలు మాత్రమే ఉంటున్నారని, ఎవరైనా పేదలు అత్యవసరమై ఆస్పత్రికి వెళితే, రెఫర్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కష్టసమయంలో ఉన్నఫళంగా పేదలను వేరే చోటకు వెళ్లమంటే ఎలాగంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవచూపి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల నుంచి ఏ ఫిర్యాదు వచ్చినా, న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు యమలా సుదర్శనం, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ సీఐలు, ఎస్‌ఐలు, అధికారులు పాల్గొన్నారు.



విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

విద్యుత్ పొదుపుతో భావి తరాలకు వెలుగు

మదనపల్లె : ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడి, ఇంధనాన్ని ఆదా చేయడంతోనే భవిష్యత్ తరాలకు వెలుగులు అందించేందుకు వీలవుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప అన్నారు. గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన బ్యానర్‌ను వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఆదా చేసి భావితరాలకు భరోసా ఇవ్వాలన్నారు. డివిజనల్ ఈఈ యుగంధర్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీవరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వారం రోజుల పాటు రైతులకు, వినియోగదారులకు, పరిశ్రమల యజమానులకు విద్యుత్ ఆదాకు సంబంధించి వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఎల్‌ఈడీ బల్బులు వాడి విద్యుత్ ఆదా చేయాలన్నారు. పగటిపూట అనవసరంగా లైట్లను వాడవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఈ సురేంద్రనాయక్, ఏఈలు రెడ్డికుమార్, నరసింహారెడ్డి, గోవిందరెడ్డి, వసంతరెడ్డి, లలిత, ముజామిల్, సిబ్బంది శేషాద్రినాగరాజు, రెడ్డిరాజులు, కృష్ణ, గోపి, కిషోర్, ఫిజోల్, బుడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం : సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి

భాగస్వాములు కావాలి

వాల్మీకిపురం : ఇంధన పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుత్పాదన లేని ఇంధనాలైన గ్యాస్, డీజిల్, పెట్రోల్, బొగ్గు వంటి వాటిని తక్కువగా వినియోగించాలని తెలిపారు. పునర్ ఉత్పాదకాలైన సౌరశక్తి, గాలిమర నుంచి శక్తిని ఉత్పాదకత వంటి వాటిని ఎక్కువగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పెద్దప్పరాజు, అధ్యాపకులు గురుప్రసాద్, విజయలక్ష్మి, నారాయణస్వామి, రేణుక, సుదర్శన్, జ్యోతి, కృపామై, నజుముద్దీన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

కలకడ : గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంఈఓ మునీంద్రనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా?, యూనిఫాం, పరిశుభ్రత వంటివి పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యంఈఓ–2 రామచంద్రారెడ్డి, ఏపీఎం రమేష్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికల గురుకుల పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ శ్రీదేవి

ఆదర్శ డిపోగా తీసుకురావాలి

మదనపల్లె సిటీ : మదనపల్లె వన్‌డిపోను ఆదర్శ డిపోగా తీసుకురావాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కలిసి పని చేస్తే మంచి డిపోకు ఈపీకె, కెఎంపిఎల్ అధికంగా వస్తుందన్నారు. ట్రాఫిక్ విభాగంలో బి.వి.నాయక్, మెయింటెన్స్ విభాగంలో పి.సుందర్‌రాజ్, పోతన్న, ఇంధనం పొదుపులో డ్రైవర్‌లు రంగనాథం, రామకృష్ణ, ఈపీకె వై.ఎస్.రెడ్డి, పివిబి రెడ్డి, చంద్రకళ, మార్కెట్ విభాగంలో ప్రతిభ కనబరిచిన బాబ్జీ, రెడ్డప్ప, మధుసూదన్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రవి తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్‌కు చెక్‌ను అందిస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

సేవాభావంతో వైద్య సేవలు అందించాలి

మదనపల్లె సిటీ : వైద్యులు సేవాభావంతో వైద్య సేవలు అందించాలని మదనపల్లె, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఎం.నవాజ్‌బాషా, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక సొసైటీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ హార్ట్‌కేర్ నిమ్స్ ఆస్పత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు ఎంతో గుర్తింపు, గౌరవం ఉందని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగం అభివృద్ధికి ఎంతో చేస్తోందని తెలిపారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ శివారెడ్డిని అభినందించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పట్టణంలోని వైద్యులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలోని హార్ట్‌కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

నిజాయితీగా వ్యాపారం చేయండి

కలకడ : కలకడలోని పోలీస్ వ్యాపార సముదాయంలో నిజాయితీ వ్యాపారాలతో ముందుకు సాగాలని సీఐ నాగేంద్ర అన్నారు. గురువారం పోలీస్ మైత్రి వ్యాపార సముదాయంలో గల వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులు ఖాళీ ఉన్నా సరే నమ్మకం, నిజాయితీ గల వారికే కేటాయిస్తామన్నారు. రోడ్డుపై ఇతర వాహనాలు నిలపరాదని, ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులతో మిత్రులుగా ఉండి మంచి పనులలో భాగస్వాములు కావాలని కోరారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ నాగేంద్ర

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు : తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) పీలేరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. ఖాదర్‌బాషా, ఎస్.మస్తాన్ అన్నారు. గురువారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద మూడో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలా ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలన్నారు. జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ 10 శాతం కాంట్రిబ్యూషన్, తాత్కాలిక పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాధాకృష్ణ, యూనియన్ నాయకులు సాధిక్‌బాషా, సతీష్, చైతన్య, అబ్బన్న, సయ్యద్ బాషా, హేమ తదితరులు పాల్గొన్నారు.



పీలేరు పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

రాయచోటి అర్బన్ : కరువుతో పాటు తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలు పార్టీలు, సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రైతులు, కూలీలు కోసం చేయాల్సిన సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలన్న డిమాండ్‌తో ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నాలో పలువురు మాట్లాడుతూ జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లోని రైతాంగం మిచాంగ్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిందన్నారు.

మల్లయ్యకొండకు పెరిగిన ఆదాయం

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై ఉన్న శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల కానుకల ద్వారా హుండీ ఆదాయం పెరిగింది. గురువారం ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఈవో రమణల సమక్షంలో టీటీడీ పరకామణి, మహిళా సేవకులు భక్తులు చెల్లించిన హుండీ కానుకలను లెక్కించారు. కానుకల ద్వారా రూ.6,66,450 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, సహదేవ తదితరులు పాల్గొన్నారు. అలాగే గురువారం అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



కానుకలు లెక్కిస్తున్న సేవకులు

పక్కాగా 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణ

బి.కొత్తకోట : ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎంఈఓ–2 భీమేశ్వరాచారి కోరారు. గురువారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో క్రీడలను నిర్వహిస్తామన్నారు. అధికారులు, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు.. నియోజకవర్గ స్థాయిలో శిక్షణ పొందిన పంచాయతీకి ఇద్దరు వలంటీర్లుకు కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. 15 ఏళ్లు పైబడిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు 17వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, డిసెంబర్ 26 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి ఈఓఆర్డీ ఈశ్వర్‌రెడ్డి, నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : ఈ నెల 15 నుంచి జరగాల్సిన ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంఈఓ నారాయణ గురువారం తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తుపాన్ ప్రభావం కారణంగా వాయిదా పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి రాష్ట్రంలో అన్ని చోట్ల ఒకేసారి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు అందాయని పేర్కొన్నారు.

17న విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లిలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఈ నెల 17న జరుగునని గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15న ఆలయంలో గంగపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచకం, అంకురార్పణ, 16న గణపతి ప్రార్థన, కలశ స్థాపన, గణపతి హోమం, నవగ్రహ హోమం, రామతారక హోమం, 17న విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, పంచామృతాభిషేకం, గోదర్శనం, అన్నదానం, రాత్రి హరికథా కాలక్షేపం తదితర కార్యక్రమాలు జరుగునన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

నూతన నియామకం



సుంకర చక్రధర్

పీలేరు రూరల్ : వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం చిత్తూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా పీలేరుకు చెందిన సుంకర చక్రధర్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ విద్యార్థి విభాగంలో పని చేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారంతోపాటు, పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి జోనల్ ఇన్‌చార్జి పదవి కల్పించినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శిగా..



ఎం.శ్రీనాథరెడ్డి

పీలేరురూరల్ : వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శిగా ఎం.శ్రీనాథరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ బారేషావలిని నియమించినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ అభివృద్ధికి శ్రీనాథరెడ్డి, బారేషావల్లి చేస్తున్న సేవలకు గుర్తింపుగా పదవులు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. పార్టీ బలోపేతానికి మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయానికి సర్టిఫికేషన్ తప్పనిసరి

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సర్టిఫికేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దిన్నెపాడు రవిరాజు తెలిపారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డులోని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించిన రైతులు తప్పకుండా నిర్ధారణ పరీక్షలు (సర్టిఫికేషన్) తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. అలాగే ఈ పద్ధతిలో సాగు చేసిన పంటల వలన ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో వివరించారు. కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణమరాజు, జూనియర్ టీఎల్ ప్రభాకర్, గుంటూరు నుంచి వచ్చిన ప్రతినిధులు ఎన్‌ఎఫ్‌ఏ పున్నారావు, జూనియర్ పీఈ పవన్, సీఎస్‌పీ అశోక్ తదితరలు పాల్గొన్నారు.

సురక్ష బీమా యోజన ఓ వరం

రామాపురం : సురక్ష బీమా యోజన పథకం ఖాతాదారులకు ఒక వరం లాంటిదని మండల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కడియాల మంజుల అన్నారు. గురువారం మాట్లాడుతూ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన గంప శ్రీనివాసులు కుటుంబానికి రూ. 2లక్షలు ప్రమాద బీమా చెక్కును అందజేశారు. నల్లగుట్టపల్లె గ్రామం బీసీ కాలనీకి చెందిన గంప శ్రీనివాసులు మరణించడంతో అతను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి సురక్ష బీమా యోజన కింద రూ.20లు జమ చేయడం జరిగిందని, దీంతో శ్రీనివాసులు కుటుంబానికి రూ. 4లక్షలు ప్రమాద బీమా మంజూరు అయ్యిందని, అందులో రూ. 2లక్షలు గంప రెడ్డమ్మకు అందించినట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంక్ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల పరిశీలన

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అనంతరాజుపేట, ఉర్లగడ్డపోడు, బొజ్జవారిపల్లి గ్రామాలలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ భూములను ఏసీ విశ్వనాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కోర్టు వ్యవహారాలపై నెమలి వెంకటరామయ్యకు సంబంధించిన భూముల విషయాలపై, అలాగే దేవాదాయ, ధర్మాదాయ భూములకు సంబంధించి పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిట్వేలి : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని కెఎస్ అగ్రహారం దళితవాడకు చెందిన మోడపోతుల నరసింహా కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆయనకు రూ. 15200 అందజేశారు.